www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 జూన్ 2025
5
వైఎస్ఆర్



జ్యోతి క్షేత్రానికి ఆగిన బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-కాశినాయన

మండలపరిధిలోని కాశినాయన జ్యోతి క్షేత్రానికి ఫారెస్ట్ అధికారులు ఆర్టీసి బస్సులను నిలుపుదల చేశారు. ఈ ఏడాది మార్చిలో అటవీశాఖాధికారులకు, యాత్రికులకు మధ్య ఈ విషయంలో పెద్ద ఎత్తున గొడవ తలెత్తిన విషయం తెలిసిందే. దిగొచ్చిన ఫారెస్ట్ అధికారులు కొద్ది రోజులు బస్సు తిప్పేందుకు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం మళ్లీ అదే సమస్య తలెత్తింది. బస్సులను జ్యోతి క్షేత్రానికి తిప్పొద్దని అటవీశాఖాధికారులు ఆర్టీసి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో భాగంగా గురువారం నుంచి బస్సుల రాకపోకలను నిలిపేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల గతంలో అనుమతి ఇచ్చారు. మళ్లీ ఎందుకు నిలుపుదల చేశారో ఫారెస్ట్ అధికారులకు మాత్రమే తెలియాలి. అధికార పార్టీ నాయకులు, ఆలయ నిర్వాహకులు ఏం చేస్తారో వేచి చూడాలి.



చినుకు రాలదు... విత్తనం పడదు

- పదును కోసం పసుపు రైతుల నిరీక్షణ
- పెట్టుబడి పెరగడం, మద్దతు ధరలు లేకపోవడంతో సాగు తగ్గే అవకాశం



కుందూ పరిధిలో పసుపు సాగు చేపడుతున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంట పొలాలలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు చేపట్టడం, సేంద్రీయ ఎరువు పంట పొలాలలో చల్లడం, కాలువలలో పూడికతీత వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. పసుపు పంటను సాగు చేసేందుకు అనువుగా భూమి పదును కాకపోవడంతో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. 15 రోజులుగా చినుకు పడకపోవడంతో పసుపు రైతుల్లో నిరీక్షణ అధికమైంది. విత్తనం, ఎరువులు సిద్ధం చేసుకుని వర్షం పడితే సాగుకు ఉపక్రమించాలని రైతులున్నారు. కొంతమంది రైతులు బోరు బావుల ఇతర నీటి వన రుల ద్వారా నీటిని పరుగెత్తి సాగు చేపడుతున్నారు. పసుపు పంట సాగు చేపట్టడానికి జూన్ చివరి వారమని రైతులు పేర్కొంటున్నారు. ఆలస్యమయ్యే కొద్దీ పంట దిగుబడి సరిగా రాదని, కలుపు అధికమవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

పసుపు సాగు ప్రాముఖ్యత..

దేశంలోని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. దేశీయ వినియోగంతో పాటు కొన్ని వేల టన్నులను విదేశాలకు ప్రతి సంవత్సరమూ ఎగుమతి చేయడంతో పాటు, మందుల తయారీలో, రంగులలో, సౌందర్య సాధనాలలో అధికంగా ఉపయోగిస్తారు. భారతీయ సంస్కృతిలో పసుపుకు మంచి స్థానం ఉంది. ప్రతి కార్యక్రమంలో పసుపును తప్పక వాడతారు. పసుపు సాగులో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పసుపు ఉత్పత్తిలో 80 శాతం వరకు మన దేశానిదే. దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వాటా మన ఆంధ్రప్రదేశ్. మన రాష్ట్రంలో గతంలో సుమారు 16,800 హెక్టార్లలో పసుపు సాగు చేస్తూ 146000 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించేవారు. అది కూడా కడప, గుంటూరు జిల్లాలో ముఖ్యంగా పసుపు సాగు చేసేవారు. కడప జిల్లాలోని 21 మండలాల్లో 2020-21లో 12500 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. తరువాత సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది.

గతంలో సాగు వివరాలు..

కడప జిల్లా పరిధిలో పసుపు పంటను రైతులు అధికంగా సాగు చేపడతారు. ఇది ప్రతి ఏడాదీ తగ్గుతూ వస్తున్నది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, సాగు ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధర సరిగా లేకపోవడం వంటి కారణాలు సాగు తగ్గడానికి కారణాలని తెలుస్తుంది. జిల్లా వ్యాప్తంగా గతంలో పసుపు సాగు అయిన వివరాలను పరిశీలిస్తే.. మైదుకూరులో 670, దువ్వూరులో 490, చాపాడులో 283, ఖాజీపేటలో 520, బి.మఠంలో 78, సికె దిన్నెలో 413, పెండ్లిమర్రిలో 62, మైలవరంలో 175, జమ్మలమడుగులో 90, కాశినాయనలో 370, పోరుమామిళ్లలో 235, కలసపాడులో 75, ఒంటిమిట్టలో 210, సిద్ధవటంలో 330, నందలూరులో 156, చిట్వేలిలో 52, పుల్లంపేటలో 88, ఓబులవారిపల్లిలో 19, రాజంపేటలో 142, రైల్వేకోడూరులో 85, రాజుపాలెంలో 40 హెక్టార్లు సాగు అయ్యేది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతుంది. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 7వేల ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగైంది. ముఖ్యంగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలంలో సాగుకు రైతులు అనాశక్తి చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిఎసిపి వారు పసుపు పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. జిల్లాలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో పసుపు పంటకు మార్కెట్ సౌకర్యం ఉంది. రాష్ట్రంలో మన జిల్లాతో పాటు దుగ్గిరాల మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుపుతారు. ధరల నిర్ణయం పూర్తిగా వ్యాపారులదే. పసుపు గ్రేడింగ్ అధికారులు మాత్రం నామమాత్రంగా అందుబాటులో ఉంటున్నారు. సరైన గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు నిల్వ సౌకర్యం అందుబాటులో లేదు.

నిలకడలేని గిట్టుబాటు ధరలు..

పసుపు పంట దిగుబడి చేతికి వచ్చిన సమయంలో ధరలు ఒక మాదిరిగా ఉంటూ, రైతులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పుడు మరో రకంగా ఉంటున్నాయి. గత మార్చి సీజన్‌లో ప్రారంభంలో పుట్టి పచ్చి పసుపు రూ. 4500 పలికింది. ఆ తర్వాత రూ. 6 వేల వరకు చేరి తిరిగి తగ్గుముఖం పట్టింది. ఉడికించిన వట్టి పసుపు ప్రారంభంలో రూ.9 వేలు ధర పలికి క్రమేపి పెరిగి రూ. 12వేల వరకు చేరుకుంది. ఆ తర్వాత తిరిగి తగ్గుముఖం పట్టి రూ. 10 వేలకు చేరుకుంది. ప్రస్తుతం విత్తన పసుపు పుట్టి రూ. 7వేలకు పైగా పలుకుతుంది. ప్రభుత్వం పసుపు పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తే సాగు మరింత పెరిగే అవకాశం కనిపిస్తుంది.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం..



రెండు ఎకరాలలో పసుపు పంట సాగు చేసేందుకు అవసరమైన ఎరువులు, విత్తన పసుపును సేకరించాను. పది రోజులుగా విత్తనాన్ని సాగు చేద్దాం అనకుంటే వర్షం పడలేదు. దీంతో భూమి పదును కాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. మేఘాలు ఊరిస్తున్న చినుకు రాలడం లేదు. వారం పది రోజుల్లో వర్షం పడకపోతే సాగుకు ఆలస్యం అవుతుంది. దీంతో పసుపు పంట సాగు చేయడం ప్రశ్నార్థకమే. విత్తనపు పసుపు ధరలు మాత్రం ధరలు అమాంతం పెరిగాయి.

- వీరారెడ్డి, పసుపు రైతు, అల్లాడుపల్లి.

పసుపు సాగుకు పెట్టుబడి పెరుగుతుంది..



పసుపు పంట సాగు చేపట్టాలంటే ఖర్చులు అధికమవుతున్నాయి. సాగు సమయంలో విత్తనపు పసుపు ధరలు అమాంతం పెరు గుతున్నాయి. అమ్మకం చేపట్టేటప్పుడు పూర్తి రూ. 5వేలు ఉన్న పసుపు ప్రస్తుతం రూ.7 వేలకు పైగా పలుకుతున్నాయి. ప్రభుత్వం పసుపు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకం అందివ్వడం లేదు. పసుపును గిట్టుబాటు ధర కేటాయించి ధరలు స్థిరంగా ఉండేలా చూడాలి. ఎకరాలో పసుపు పంట సాగు చేసేందుకు విత్తనం సేకరించి నిల్వ ఉంచాం.

- ప్రసాద్, పసుపు రైతు, సిద్ధారెడ్డిపల్లె.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని, అందుకోసం ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పిలుపునిచ్చారు. గురువారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం, ఈగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వాకథాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టడం కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల వసతి గృహాలు, కళాశాలలు,పాఠశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గుంటూరులో నషా ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. నిత్యం తల్లిదండ్రులు తమ పిల్లల చెడు వ్యసనాలపై అప్రమత్తంగా వ్యవహరించి వారిలో మంచి అలవాట్లపై అవగాహన పెంచాలన్నారు. ఎస్‌పి అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక లాంటి యువత డ్రగ్స్ బారిన పడకుండా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూకృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించడానికి నషాముక్త్ భారత్ అభియాన్ వంటి గొప్ప కార్యక్రమంలో భాగస్వాములు అయినందుకు సంతోషంగా ఉందన్నారు. భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న మాదకదవ్యాల మహమ్మారినీ పారద్రోలాలన్నారు. ఇటీవల 95 కిలోల డ్రగ్స్‌ను సీజ్ చేశామని తెలిపారు. గంజాయి అమ్మకాలు,వినియోగాన్ని నిరోధించడానికి 1972 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియజేస్తే చట్టపరమైన కఠినమైన చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ డ్రగ్ రహిత సమాజాన్ని ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపి మాదకద్రవ్యాలను నిర్మూలించాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు 'నా దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను కృషి చేస్తాను' అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ప్రకాష్ బాబు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి కృష్ణ కిషోర్, కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాస రావు, పలువురు జిల్లా అధికారులు, విద్యార్థులు, ఎన్‌జిఒలు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిజిహెచ్‌లో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులను ఆ కారణంగా తొలగించడం దారుణమని, తిరిగి వీరిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం కడప పాత బస్టాండ్ పూలే సర్కిల్‌లో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కడప జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్స్‌గా పనిచేస్తున్న ఎం.హరికృష్ణ, ఎస్.సంధ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ కె.మహేష్‌ను ఏ కారణం లేకపోయినా విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఎంఒయు ప్రకారం తమకు సబ్ కాంట్రాక్టర్ బాల నారాయణరెడ్డి వేతనాలు చెల్లించడం లేదని గత సంవత్సరం డిసెంబర్‌లో కడప జిజిహెచ్‌కు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి కార్మికులు తీసుకెళ్లారన్నారు. ఆ అక్కసుతోనే ముగ్గురు కార్మికులను తొలగించారని తెలిపారు. 6 నెలల నుంచి జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందించామని చెప్పారు. స్వయానా జాయింట్ కలెక్టర్‌తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోమని కడప జిజిహెచ్ స్పెషల్ కలెక్టర్ రంగస్వామికి చెప్పారని పేర్కొన్నారు. కడప జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు కూడా చెప్పారని తెలిపారు. తర్వాత లేబర్ కోర్టు కూడా తొలగించిన ముగ్గురు కార్మికులను విధుల్లోకి తీసుకోమని తీర్పు ఇచ్చినా అధికారులు గానీ, సబ్ కాంట్రాక్టర్ బాల నారాయణ రెడ్డి ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకున్న పాపాన పోలేదని తెలిపారు. లేని పక్షంలో కడప జిజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి. వెంకటసుబ్బయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, కోశాధికారి ఎస్.గోపి, నగర అధ్యక్షులు సుంకర రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఆనందు, సిఐటియు నాయకులు గోవిందు, విమానం మెడికల్ యూనియన్ నాయకులు పవన్, హరి, ఉదయ్, కార్మికులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్ దిష్టిబొమ్మతో నిరసన తెలియజేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల (కాశినాయన) : రిమ్స్‌లో పనిచేస్తున్న అకారణంగా ముగ్గురు కార్మికులు తమకు సక్రమంగా జీతాలు అందించాలంటూ అడిగినందుకు వారిని విధుల నుంచి తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా పోరుమామిళ్ల పట్టణంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మండల కమిటీ నాయకులు రఫాయల్, సుందరయ్య, జమాల్, రత్నమయ్య నారాయణ, బీబీ, మేరి కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కడప రిమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి పనిచేస్తున్న కార్మికులను తొలగించారని, వెంటనే ఆ కార్మికులను విధుల్లోకి తీసు కోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి యూనియన్ గౌరవాధ్యక్షులు రాఘవ కోరారు. గురువారం ఆసుపత్రి ఎదురుగా కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి యూనియన్ అధ్యక్షులు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు మల్లికార్జున, నరసింహులు, ప్రసాద్, రాణి, దేవి, మల్లమ్మ, రామేశ్వరం లక్ష్మీ, చెన్నమ్మ, దుర్గా, మార్తమ్మ, జ్యోతక్క, కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎర్రముక్కపల్లి సమీపంలోని భాకరాపేట వద్ద ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎర్రముక్కపల్లె వైపు పూర్తి కావచ్చాయని, కానీ అంగడి వీధి వైపు పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. భూసేకరణ, పరిహారం, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో కడప కార్పొరేషన్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తునారన్నారు. రెవెన్యూ, రైల్వే, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థల సేకరణ ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. తక్షణమే స్థల సేకరణ పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల పాత బ్రిడ్జి ద్వారా ప్రజల రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. ఎర్రముక్కపల్లి నుంచి అంగడి వీధికి ఆటోలు వెళ్లే పరిస్థితి లేదన్నారు. దీని కారణంగా ప్రజలు ఆటోలకు అధిక డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. పాత బ్రిడ్జి కింద ప్రజలు వెళ్లే సందర్భంలో కాళ్లు చేతులు దెబ్బలు తగలడం, గాయాల పాలవటం, అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఇటీవల ఒక మహిళ వెన్నెముక దెబ్బతిని ఆసుపత్రి పాలైన పరిస్థితి ఉందన్నారు. అనేకమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే కార్పొరేషన్, రెవెన్యూ, రైల్వే అధికారులు అన్ని రకాల పనులను పూర్తి చేసి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, గోవిందు, నరసింహ, తిమ్మయ్య, లెనిన్ ప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

భారీ స్కోరు దిశగా కడప జట్టు



201 పరుగులు చేసిన ప్రణీల్ రెడ్డి

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం వై.ఎస్. రాజా రెడ్డి ఎసిఎ స్టేడియంలో కర్నూలు, కడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారం భమైంది. ఈ మ్యాచ్‌లో కడప జట్టుకు చెందిన ప్రణీల్ రెడ్డి డబల్ సెంచరీ, గురు విగ్నేష్ సెంచరీ చేయ డంతో కడప జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమ యానికి 93.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 401 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆర్. ప్రనిల్ రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 291 బంతులను ఎదుర్కొని 23 బౌండరీల సాయంతో 201 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ గురు విగ్నేష్ 147 బంతులను ఎదుర్కొని, 15 పౌండరీలు ఆరు సిక్సర్లతో సహాయంతో 139 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మల్లికార్జున రెండు వికెట్లు తీసుకున్నాడు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో కెఎల్‌ఎం విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల విడుదలైన పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో కెఎల్‌ఎం విద్యార్థినులు మంచి మార్కులు సాధించారని కళాశాల ఎండి కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సుకు చెందిన మహిమ 95 శాతం, రేష్మ 90 శాతం, దీపిక 85 శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్సులో యక్షిత రెడ్డి 91 శాతం, మహేశ్వరి 90 శాతం, వెన్నెల 89 శాతం సాధించారని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో మనీషా 87 శాతం, వర్షిత 87 శాతం, ఇంద్రజ 84 శాతం సాధించారని పేర్కొన్నారు. విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి రత్నమ్మ, ప్రథమ సంవత్సర విభాగాధిపతి డి.ప్రభావతి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

కమలాపురం మార్కెట్ కమిటీ నియామకం

- వైస్ చైర్మన్‌గా ఆకుల చలపతి - డైరెక్టర్‌గా కొండాల చెన్నయ్య

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఆకుల చలపతిని, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కొండాల చెన్నయ్యను నియమిస్తూ టిడిపి ఉపాధ్యక్షులు పుత్త నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నూరుకు చెందిన ఆకుల చలపతి తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగాను, యువనేతగాను, మండల నాయకుడుగాను తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేశారు. చెన్నూరు కొత్త గాంధీ నగర్‌కు చెందిన కొండాల చెన్నయ్య ఆది నుంచి పార్టీకి కట్టుబడి పనిచేస్తూ వచ్చారు. ఈనెల 28న కమలాపురంలోని అమరావతి కల్యాణమండపంలో మధ్యాహ్నం 3. 45 గంటలకు మార్కెట్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి తో పాటు వైస్ చైర్మన్ ఆకుల చలపతి డైరెక్టర్ కొండాల చెన్నయ్య మరి కొంతమంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, కమలాపురం ఎమ్మెల్యే, పలువురు టిడిపి నాయకులు హాజరు కానున్నారు.

టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి-కాశినాయన

బద్వేల్ నియోజకవర్గంలోని కలసపాడు మండలంలో అధికార పార్టీ తెలుగుదేశంలో గ్రుపు విభేదాలు భగ్గుమన్నాయి. గురువారం కలసపాడు మండలంలోని టిడిపి కార్యాలయంలో మండల పరిశీలకుడు ఖాదర్ బాషా మండల పార్టీ సమావేశం నిర్వహించారు సమావేశం జరుగుతుండగా అక్కడ ఉన్న రెండు గ్రూపుల మధ్య గొడవలు దారి తీసింది. ఒకే పార్టీలో రెండు గ్రూపుల మధ్య తగాద చోటు చేసుకోవడంతో పరిశీలకుడు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది ఈ విధంగా మండలంలో రెండు గ్రూపులు ఉండడంతో నియోజకవర్గంలోని నిజమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని నియోజకవర్గంలో ప్రజలు బలంగా చర్చించుకుంటున్నారు.

2 నుంచి మహాగురుకులంలో తరగతులు ప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

పేద విద్యార్థులకు అధునాతన వసతులు, నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో బ్రహ్మంగారిమఠంలో నిర్మించిన డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ బాలుర మహా గురుకులంలో జులై 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో తరగతుల ప్రారంభానికి సంసిద్ధత, ఏర్పాట్లు, విద్యార్థుల అడ్మిషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో గురుకులాన్ని ఏర్పాటు చేశామన్నారు. 960 మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి గాను 800 మంది విద్యార్థులతో అడ్మిషన్లను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే సగిలేరు, బి.మఠం గురుకుల పాఠశాలల పాత భవనాల్లోని 660 మంది విద్యార్థులను కూడా మహా గురుకులంలోకి బదిలీ చేశామన్నారు. కొత్త అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. తరగతులు ప్రారంభమయ్యే నాటికి మహా గురుకులంలో ఎలాంటి మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలన్నారు. ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, డైనింగ్ రూమ్, డార్మెటరీ రూమ్స్‌లతోపాటు రోడ్లు, విద్యుత్, వాటర్, గ్రీనరీ, ఉద్యాన మొక్కల ప్లాంటేషన్, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని రకాల సౌకర్యాలను ఎలాంటి కొరత లేకుండా సమకూర్చాలన్నారు. ఆధునాతనమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించే మహా గురుకులంలో చేరేందుకు అర్హులైన పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్‌డిఒ చంద్రమోహన్, సాంఘిక సంకేమ గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డిఇఒ షంషుద్దీన్, ఎస్ఎస్ఎ ఎపిసి ఎ. నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫర్ డిడి సరస్వతి, కాంట్రాక్టు ఏజెన్సీ పాల్గొన్నారు.

బాలకొండ గంగాధరకు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ రచయిత, ప్రభుత్వ కళాశాల చరిత్ర అధ్యాపకుడు బాలకొండ గంగాధరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ పకటించింది. గంగాధర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ సీనియర్ ఆచార్యులు డాక్టర్ ఈ సుధారాణి పర్యవేక్షణలో 2022 సంవత్సరం నుంచి రాష్ట్రపతి భవన్ కు ఆంధ్ర ప్రముఖులు విమర్శనాత్మక అధ్యయనం పై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం సమైక్య భారతదేశ నిర్మాణానికి వివిధ ప్రాంతాల ప్రజలు నాయకులు, దేశ సమగ్రతకు కృషి చేశారని పేర్కొన్నారు. అందులో భాగంగా దేశంలోనే మొదటగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ భారతదేశ నిర్మాణంలో కీలకమైన పాత్ర పోషించిందని తెలిపారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంటా చక్రపాణి బాలకొండ గంగాధర్ డాక్టర్ పీహెచ్డీ పొందిన సందర్భంగా ఆయన సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రీసెర్చ్ సూపర్‌వైజర్, సీనియర్ ప్రొఫెసర్ సుధారాణి, ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర సీనియర్ ఆచార్యులు డాక్టర్ అంజయ్య పాల్గొన్నారు.



డాక్టరేట్ పొందిన గంగాధర్‌ను సన్మానిస్తున్న ఉపకులపతి

'ఉక్కు' పనులు ప్రారంభించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి కడపలో జరిగిన మహానాడు వేదికగా పది రోజులలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలు పెడతామని చెప్పిన హామీ ఏమైందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రశ్నించారు. గురువారం కడప డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ప్రజలకు మహానాడు వేదికగా ఉక్కుపై ఇచ్చిన మాటను సిఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవాలని అన్నారు. మహానాడు కడప జిల్లాలో ప్రతిష్టాత్మకంగా గత నెల నిర్వహించారని చెప్పారు. ముఖ్యమంత్రి కడప ఉక్కు పనులు పది రోజులలో ప్రారంభిస్తామని చెప్పి మళ్ళీ 20 రోజులు గడిచాయని పేర్కొన్నారు. ఇంత వరకు ఆ ప్రస్తావనే లేదని అన్నారు. కడప ఉక్కు విభజన హక్కు, ఇది ఆంధ్రుల హక్కు అన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతకు సంజీవని కడప ఉక్కు అన్నారు. ఈ ప్రాంత యువత భవిష్యత్ అన్నారు. ఇక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. విభజన చట్టంలో స్పష్టంగా రాసుకున్న కడప ఉక్కు ను కేంద్ర ప్రభుత్వం గడిచిన ఇన్ని సంవత్సరాలుగా ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో ఈప్రాంత ప్రజానీకానికి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల మాటలు కాకుండా కేంద్రాన్ని నిలదీసి కడప ఉక్కు నిధులు రాబట్టాలని ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు పాల్గొన్నారు.

'వేమూరి' నియామకం హర్షణీయం

ప్రజాశక్తి-కడప అర్బన్



అభినందిస్తున్న రహమతుల్లా

ఎపిఎన్ఆర్ టిఎస్ చైర్మన్ రవి కుమార్ వేమూరిని ప్రభుత్వ సలహాదారులుగా మరో సారి ప్రభుత్వం నియ మించడం హర్షణీయమని ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా పేర్కొన్నారు. గురువారం ఎన్ఆర్ఐ కార్యాలయంలో రవికుమార్‌ను స న్మానించారు. ప్రభుత్వ సలహాదారుగా 2014-19 మధ్య ఎపి ఎన్ఆర్‌టిఎస్ చైర్మన్‌గా పనిచేసి విశేష సేవలందించిన రవి వేమూరుకు మరోసారి సిఎం చం ద్రబాబు అవకాశమిచ్చారు. ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలి పారు. రవికుమార్ వేమూరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు అర్జున్ ఆస్పత్రిలో ఉచిత ఫైబ్రో స్కాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని నెహ్రూ పార్క్ సమీపంలో ఉన్న కో-ఆపరేటివ్ కాలనీ, డాక్టర్ బాలిరెడ్డి లైన్‌లో ఉన్న అర్జున్ ఆసుపత్రిలో శుక్రవారం ఉచితంగా ఫైబ్రో స్కాన్ చేస్తామని డాక్టర్ అవ్వారు అర్జున్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతినెలా 4వ శుక్రవారం ఉచిత స్కాన్ సౌకర్యం ఉంటుందని చెప్పారు. చెన్నై అపోలో ఆసుపత్రి నుంచి అనుభవజ్ఞులైన లివర్ వైద్య నిపుణులు డాక్టర్ యువియు వంశీధర్ రెడ్డి అర్జున్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆల్కహాల్ లివర్ సమస్యలు, కామెర్లు, లివర్ సిరోసెస్ , ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి, లివర్ క్యాన్సర్, లివర్ ట్రాన్స్ ప్లాంట్, లివర్ ఇన్‌ఫెక్షన్, ఆటో ఇమ్మ్యును , ఫ్రాంక్రిసిస్, గాల్ బ్లాడర్‌లో రాళ్లు, ప్రెగ్నెన్సీలో లివర్ సమస్యలు, అన్ని ఇతర ఉదర సమస్యలు చూస్తారని తెలిపారు. సమస్య ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 9985422583, 8332080900 ఫోన్ చేసి అపాయింట్మెంట్ తీసుకోవచ్చని పేర్కొన్నారు.


గొర్రెలకు మందు తాపిస్తున్న వైద్యులు వాసా శ్రీనివాస

జీవాల ఆరోగ్యం కోసమే నట్టల నివారణ మందు

పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస

ప్రజాశక్తి - ముద్దనూరు

జీవాలకు నట్టల నివారణ మందు తాపించడం వల్ల అవి ఆరోగ్యంగా ఉంటాయని, వేల్పుచెర్ల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస సూచించారు. ఉప్పలూరు గ్రామంలో గురువారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందు తాపిస్తే జీవాల యజమానులకు ఆదాయం చేకూరుతుందన్నారు. సామూహిక నట్టల నివారణ కార్యక్రమం జులై 10 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని గొర్రెల యజమానులు, కాపరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, పశు యజమానులు, కాపరులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజాశక్తి - ముద్దనూరు


తహశీల్దార్ అలీఖాన్

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ అలీఖాన్ పేర్కొన్నారు. ఆయన ముద్దనూరు తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం అలీఖాన్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని తెలిపారు. రైతు భూములకు సంబంధించి మ్యుటేషన్, 1బి, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకం, ఎండార్స్‌మెంట్, ఫ్యామిలీ మెంబర్, కుల, ఆదాయ ధ్రువీకరణ వంటి పత్రాలు నిబంధనల ప్రకారం అర్హులైన వారికి మంజూరు చేస్తామన్నారు. ఆయన కడప అర్బన్ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరు వచ్చారు.

'అన్నదాత సుఖీభవ' అమలులో ఆంక్షలు వద్దు

ప్రజాశక్తి - వేంపల్లె


మాట్లాడుతున్న తులసిరెడ్డి

కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకానికి ఆంక్షలు, కోతలు విధించవద్దని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి తన మేనిఫెస్టోలో ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా తొలి 2024-25లో రైతులకు ఒక్క పైసా కూడా ఆర్థికసాయం చేయలేదని విమర్శించారు. 2025-26కుగానూ ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు కాలేదన్నారు. సమాచారం మేరకు లబ్ధిదారుల ఎంపికలో అనేక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు అయిదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వారందరికీ వెంటనే జీతాలు ఇవ్వాలని తులసిరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ నాయకుడు పూల నజీర్, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం నయం

ప్రజాశక్తి - చక్రాయపేట

ఫిజియోథెరపీ చేయించడం వల్ల అంగవైకల్యం నయమవుతుందని ఫిజియోథెరపిస్ట్ వై.లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని సురభి గ్రామం నాగులగట్టుపల్లెలోని భవిత కేంద్రంలో అంగవైకల్యం కలిగిన ప్రతిభావంతుల చిన్నారులకు ఫిజియోథెరపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రంలోని 20 మంది చిన్నారులకు ఫిజియోథెరపీ చేశామన్నారు. ప్రతి వారం భవిత కేంద్రంలోని చిన్నారులకు ఫిజియోథెరపీ చేయడం వలన అంగవైకల్యం అనేది చాల వరకు నయమైందన్నారు. ప్రతి శనివారం ఇంటి వద్దకెళ్లి ఫిజియోథెరపీతోపాటు విద్యా బుద్ధులు నేర్పుతున్నట్లు చెప్పారు. సిడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థుల్లో ఫిజియోథెరపీతో చాలా మార్పు వచ్చినట్లు చెప్పారు. భవితలో చదివే విద్యార్థులకు బొమ్మలతో విద్యా బుద్ధులు నేర్పిస్తున్నట్లు ఐఇఆర్‌టి సత్యనారాయణ, లలిత పేర్కొన్నారు. భవితకేంద్రంలో పని చేస్తున్న చిన్నారులందరికీ ఉపకార వేతనాలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

నేడు దువ్వూరు మండల సమావేశం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడాలి

ప్రజాశక్తి - చాపాడు

దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పిహెచ్‌సీలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం దోమ పుట్టకూడదు-కుట్టకూడదు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలంటే దోమలను నివారించాలన్నారు. సిబ్బంది కూడా వర్షాకాలం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల వైద్యాధికారి శివప్రసాద్ రెడ్డి, సిహెచ్‌ఒ మహదేవ్ యాదవ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, పీహెచ్‌ఎం సుకన్య, ఎంపి హెచ్‌ఈఒ రాఘవయ్య, బాబుల్‌రెడ్డి, ప్రసాద్, లావణ్య భవాని, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

పులివెందుల టౌన్ : సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో కృష్ణమూర్తి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు మూడు రోజు లుపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణ మూర్తి, ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. అంబేద్కర్ చిత్రపటానికి, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూల మాలవేసి నివాళులర్పించారు. గ్రామాల పరిశుభ్రతపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ సమస్యలు నెలకొన్న ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకువస్తే వారు అధికారులకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నీటి తొట్లు నిర్మించారు.. నిర్వహణ మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

పశువుల దాహం తీర్చడం కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లెలు పలుచోట్ల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల నీటి తొట్టి నిర్మించారు. తొట్టిలోని నీళ్లు వారాల తరబడి నిల్వ చేరి ఉండడం వల్ల తొట్టి అడుగు భాగంలో పాచి పట్టి అపరిశుభ్రంగా మారింది. తొట్టి ఖాళీ అయిన తర్వాత శుభ్రం చేయకుండా నీటిని అలానే వదులుతున్నారు. దీంతో నీరంతా కలుషితంగా మారి దుర్వాసన వస్తోంది. ఇలాంటి కలుషితమైన నీటిని తాగడం వల్ల పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని పశుపోషకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి తొట్లను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటి తొట్లు నిర్మించడం సంతోషకరమైనా, వాటి నిర్వహణను అధికారులు మరువడం ఆవేదనకు గురి చేస్తుందని పాడి రైతులు వాపోతున్నారు.


తొట్టి శుభ్రతకు నోచుకొనక పాచి పట్టి కనిపిస్తున్న నీరు

పేదల ఇళ్లు ఖాళీ చేయమనడం దుర్మార్గం


మహిళలతో మాట్లాడుతున్న ఇర్ఫాన్ బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఐదు దశాబ్దాల నుండి ప్రొద్దుటూరు మండలం సోముల వారిపల్లె పంచాయతీ పరిధిలో నివాసముంటున్నవారికి నోటీసులిచ్చి ఇళ్లు ఖాళీ చేయమని చెప్పడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. ఈ ప్రాంతం అటవీ శాఖ పరిధిలో వస్తుందని ఇళ్లు ఖాళీ చేయమని అధికారులు నోటీసులు ఇవ్వడంతో విషయం తెలుసుకున్న ఇర్ఫాన్ బాషా గురువారం ఆరవ వార్డులో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ ఆరవ వార్డు ఈశ్వర్ రెడ్డి నగర్‌లో గడచిన దశాబ్దాలుగా పలువురు జీవనాధారం కోసం ఇళ్లను ఏర్పాటు చేసుకొని చేతివృత్తులు, స్వయం ఉపాధి, చిన్నపాటి పరిశ్రమలు జీవనాధారంగా దాదాపు 300 కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. ఇంటి పన్ను, విద్యుత్ మీటర్ల బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన నేతలు ఇచ్చిన మాటను మరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారులు నోటీసులు జారీ చేయడం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. పునరాలోచించి నోటీసులను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ప్రజలకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు ప్రభుత్వంతో పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, పీసీసీ కార్యదర్శి అప్పు పోగుల ఎల్లయ్య, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అబ్బాస్, అలందర్, షామీర్, మౌలాలి, గౌస్, స్థానికులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం టిబి ముక్తి భారత్ కార్యక్రమంలో జరుగుతున్న సర్వేను ఆమె ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు వస్తున్నవారు, బరువు తగ్గిపోతున్న వారు, ఆకలి లేని వారు, దగ్గినప్పుడు గళ్ళలో రక్తం పడడం, సాయంత్రం జ్వరం రావడం వంటి లక్షణాలున్న వారు గళ్ళ పరీక్ష చేయించుకోవాలన్నారు. తద్వారా టిబి ఉందోలేదో తెలుస్తుందన్నారు. టిబి రోగులకు ఆరు నెలలు మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ మధుమేహం, ధూమపానం, మద్యపానం, పోషక ఆహార లోపం ఉన్నవారు కిడ్నీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు టిబి మందులు వాడి నయమైన వారి కుటుంబ సభ్యులు గళ్ళ పరీక్ష చేయించుకోవడం వలన ఈ వ్యాధి ఉందో లేదో నిర్ధారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ రాజారత్నం, టిబి హెల్త్ విజిటర్ సిద్ధారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు మల్లీశ్వరి, జ్యోతి, ఆశా కార్యకర్తలు మల్లేశ్వరి, పుష్పకుమారి, ప్రణీత, తులసి పాల్గొన్నారు.


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప

డ్రగ్స్ వాడడం ఆరోగ్యానికి హానికరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో గురువారం కడప నగరం మరియాపురంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణకు వ్యతిరేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, డ్రగ్ మెనాస్ నిర్మూలన బాధితులకు న్యాయ సేవలు గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఎన్‌సిసి కడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులచే గురువారం అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ర్యాలీ కళాశాల నుండి ప్రారంభమై కడప ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం టౌన్ : కమలాపురం పోలీస్ శాఖ, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఐ ఎ. విద్యాసాగర్, ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ మాదకద్రవ్యాల పోస్టర్లను విష్కరించారు. అలాగే పోస్టర్లకు ఆటోలకు అతికించడం ద్వారా యువతకు అవగాహన కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఉమేష్ చంద్ర, శీలం శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల (కాశినాయన) : ప్రస్తుత సమాజంలో యువకులు డ్రగ్స్‌కు, మద్యపానానికి దూరంగా ఉండి జీవితాలు బాగు చేసుకోవాలని సిఐ శ్రీనివాసులు తెలిపారు.గురువారం పోరుమామిళ్ల పట్టణంలో డ్రగ్స్, మద్యపానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి కలసపాడు ఎస్ఐ తిమోతి, అధికార పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

కడప అర్బన్ : డ్రగ్స్ మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాన్ని తెలుసుకుని దూరంగా ఉంటూ తమ చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజ్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్, ఓబిసి, యాంటీ డ్రగ్ సెల్ ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. నరసింహులు, వైవీయూ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా డిఎస్పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అమ్మవారి శాల సమీపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డిఎస్పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటివి ఉపయోగిస్తున్నారని తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, టిడిపి పట్టణ శాఖాధ్యక్షుడు దాసరి బాబు, మండల అధ్యక్షుడు భీమయ్య, దువ్వూరు మండల శాఖ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, విఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరాముడు, పోలీస్ సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : కొందరు చిన్న వయసులోనే మత్తు పదార్థాల కు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని సీఐ నరేష్ బాబు కోరారు. నషాముక్త భారత్ అభియాన్ ఈగల్ వారి కార్యాచరణలో భాగంగా వాకతాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల నివారణకు హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్లు 1972, 14446 ఏర్పాటు చేశామని, ఏదైనా సమాచారం చెప్పవచ్చన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు, కరస్పాండెంట్లు, ప్రజలు, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, తహశీల్దారు శోభన్‌బాబు, కొండాపురం సిఐ మహమ్మద్ రఫీ, ఎక్సైజ్ సీఐ గోపీకృష్ణ, ఎస్ఐలు ప్రతాపరెడ్డి, రిషికేశవరెడ్డి, సునీల్‌కుమార్, నాగమురళి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు.. జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆర్‌డిఒ చిన్నయ్య, డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. విద్యార్థులు, మహిళలు, పోలీసులు, డిఎస్పి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. గంజాయిని పెంచకు, పంచకు, పీల్చకు, గంజాయ్ అలవాటు జీవితానికి పొరపాటు అంటూ నినాదాలు చేశారు. పూలంగల కూడలి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐలు చాంద్ బాషా, నరసింహులు, వెంకటరమణ, ఉలసయ్య, ఎక్సైజ్ సిఐ చెన్నారెడ్డి, ఎస్ఐలు నారాయణ, రవి కుమార్, తహశీల్దార్ నజీర్ అహ్మద్, ఎంఇఒ చంద్రశేఖర రావు, పోలీసులు, జేఎన్టీయూ కాలేజీ, మహిళ డిగ్రీ కాలేజీ, పాలి టెక్నికల్ కాలేజీ, వేముల కస్తూర్బా ప్రిన్సిపల్‌లు, విద్యార్థులు, రెవెన్యూ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : డ్రగ్స్‌కు అలవాటు పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కామనూరు పిహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్ బాబా, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బివ వరప్రసాద్, అప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండడం వల్ల భవిష్యత్తు సుఖంగా ఉంటుందని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి వేంపల్లెలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఐక్యూఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, సివిల్ ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. విన్నీలత ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఎఎస్ఐ శ్రీనివాస రెడ్డి, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ దిగుబడులు పొందాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మైదుకూరు మండలం శివపురం గ్రామంలో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్‌తో కలిసి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఎరువులు అధిక మోతాదులో వాడితే భూమి దిగుబడి తగ్గి పనికిరాకుండా పోయే అవకాశం ఉందన్నారు. డ్రోన్ ధర రూ.9.8 లక్షలు కాగా ప్రభుత్వం రూ.8లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. ఎకరా పొలానికి మందు డ్రోన్ ద్వారా ఆరు నిముషాల్లో పిచికారీ చేయ వచ్చన్నారు. అవసరం మేరకు మాత్రమే ఎరువులు ఉపయోగించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాల న్నారు. మార్కెట్ యార్డ్‌లో రైతులు ధాన్యం నిల్వ ఉంచుకోవాలని, గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్మకాలు చేసుకోవాలన్నారు. అనంతరం డ్రోన్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ బాలగంగాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగ మోహన్, రైతులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లి పంచాయతీలో నిర్మిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహా గురుకులం పాఠశాల పనులను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గురువారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో సీసీ రోడ్డు, మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన వసతులు, సమస్యల గురించి ఉపాధ్యాయులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల కూడలిలో అభివృద్ధి ప్రణాళికలను అధికారులు ఎమ్మెల్యే కు చూపించారు. వెంటనే ఐదు రోడ్ల కూడలి అభివృద్ధికి అవసరమైన వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఎల్లటూరు సాం బశివరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి, పూజ శివయ్య, చిలమల నారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీనివాసులు, పార్టీ మండల ఉపాధ్యక్షులు శీలం నర్సింహులు, అధికారులు పాల్గొన్నారు.


సభ్యులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెబుతున్న మున్సిపల్ చైర్మన్

రసాభాసగా మైదుకూరు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మున్సిపల్ సమావేశం గురువారం చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి పార్టీలకతీతంగా సభ్యుల ప్రశ్నలతో రసాభాసగా సాగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ వైసిపి కౌన్సిలర్లు పనులు చేస్తే బిల్లులు చెల్లించకుండా పక్షపాతం చూపుతున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు విద్యుత్ మోటర్లు రిపేర్ చేయిస్తే మూడు నెలలు అవుతున్నా బిల్లులు చెల్లించడం లేదన్నారు. కడప రోడ్డులో వంకలపై పూర్తిస్థాయిలో కొలతలు వేయకుండా నిర్మాణాలు చేపడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు మరుగుదొడ్లు లేవని, ఉన్నవాటిని కూడా తొలగించారని తెలిపారు. మున్సిపాలిటీకి ఉపయోగించే వాహనాల డీజిల్ సరఫరాలో అనుమానాలు ఉన్నాయని, వాటి వివరాలు తెలపాలన్నారు. టిడిపికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ కుర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా ఎన్నికైన నాటినుండి ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ఉండడంతో ఎన్నికల్లో ఎందుకు పోటీ చేశామని మనస్థాపం చెందుతున్నామన్నారు. వార్డులోకి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చంద్ర మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రెండేళ్లపాటు బిల్లులు మంజూరు కాలేదని, ప్రస్తుతం ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న వైసిపి కౌన్సిలర్లు


కందులు, మినుములు పంపిణీ చేస్తున్న పేర్ల పార్థసారథిరెడ్డి, ఎఒ ఓబులేస్

ఉచిత కందులు, మినుములు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

స్థానిక వ్యవసాయ కార్యాలయంలో కందులు, మినుములు రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి రైతు సేవా కేంద్రంలో మినుములు, కందులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేర్ల పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దగ్గరలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో పేర్లను ఇకెవైసి ద్వారా నమోదు చేసుకొని తద్వారా మినీ కిట్లను రైతులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది సంతోష్ కుమార్, హారిక, రైతులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండాలని వైసిపి నాయకులు పేర్కొన్నారు. టీడీపీ తోరణాలు తొలగించారనే నెపంతో అక్రమంగా హత్యాయత్నం కేసులో మంగళవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలైన మైనర్ బాలురలను వైసిపి నాయకులు గురువారం పరామర్శించారు. తల్లిదండ్రులకు పులివెందుల మున్సిపాలిటీ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి భరోసా ఇచ్చారు. మైనర్ బాలురకు అన్ని విధాలా సాయం అందిస్తామన్నారు. చదువు మీద ధ్యాస పెట్టి ఉన్నతంగా భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కో-ఆప్షన్ చంద్రమౌళి, విద్యార్థి విభాగం నాయకుడు జస్వంత్ రెడ్డి, నాయకులు కిరణ్, మోట రామచంద్ర, రాజశేఖర్, విష్ణు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఎంపిడిఒ ముద్దనూరుకు బదిలీ

ప్రజాశక్తి వేముల

వేముల ఎంపిడిఒ రాధాకృష్ణవేణి ముద్దనూరుకు బదిలీ అయ్యారు. ఉద్యోగోన్నతిపై ఎంపిడిఒగా నెలరోజుల క్రితం విధుల్లో చేరిన కృష్ణవేణి పనిచేసిన కొద్దిరోజులే అయినా మండల ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి చేయడంతో అందరి మన్నలు పొందరు. బదిలీ ఉత్తర్వులు రావడంతో గురువారం ఇక్కడ నుంచి ముద్దనూరుకు వెళ్లారు. బదిలీపై వెళ్తున్న ఆమెను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. పులివెందుల ఎంపీడీఓకు వేములకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జమ్మలమడుగు డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీత వైద్యులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం గీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను, ల్యాబ్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కరిష్మా, డాక్టర్ ఎం.శ్రీకాంత్, సిహెచ్‌ఒ వై.ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, సిబ్బంది రామారావు, జయమ్మ, జయకర్ పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ గీత